నమస్తే తెలంగాణ
హనుమకొండ
3 | వరంగల్, ఆదివారం 18 ఆగస్టు 2024 | HANUMAKONDA



ఏటూరునాగారం : జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న చిన్నబోయినపల్లి రైతులు

# అర్హత ఉన్నా మాఫీ కాలే..

## రేవంత్ సర్కారు తీరుతో అన్నదాత ఆగమాగం



- మాకెందుకు చేయలేదంటూ రైతుల నిరసనలు
- మూడో విడుతలో అదే తీరు.. మొదటి దశ నుంచీ అదే అయోమయం
- మొత్తం చేసేశామంటూ ఆర్భాటంగా ప్రకటనలు
- సమాచారం లేక, సమాధానం చెప్పేవారు లేక సతమతం

రుణమాఫీపై రేవంత్ సర్కారు తీరు అన్నదాతలకు ఆగ్రహం తెప్పిస్తున్నది. మొదటి విడత నుంచి సరైన సమాచారం లేక, మాఫీ వివరాలు తెలియక ఆగమైన రైతులకు మూడో విడుతలోనూ అదే నిరాశే ఎదురవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇదిగో చేశాం.. అదిగో చేసేశాం అంటూ ఆర్భాటంగా గొప్పలు చెప్పకోవడం తప్ప చేసిందేమీలేదంటూ అర్హత ఉన్నా ఎందుకు చేయలేదంటూ భగ్గుమంటున్నారు. శనివారం ఉమ్మడి వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో పంట రుణమాఫీ కాని అన్నదాతలు కడుపుమండి రోడ్డెక్కారు. చాలాచోట్ల ఏవో కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపగా, సమాధానం చెప్పలేక దాటవేయడంతో అధికారులు తీరుపై వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ ప్రకారం రేవంత్ సర్కారు మొత్తం రుణమాఫీ చేయాలని లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 17*

## మాఫీ ఎప్పుడు సారూ..



నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను మహదేవపూర్ యూనియన్ బ్యాంక్‌లో రూ.1.50 లక్షల పంట రుణం తీసుకున్న. వడ్డీ కూడా కట్టిన. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రూ.1.50 లక్షల రుణ మాఫీ లిస్ట్‌లో పేరు వస్తుందని అనుకున్నప్పటికీ రాలేదు. ఇప్పుడు రూ.2 లక్షల మాఫీ దాంట్ల పేరు వచ్చిందా అని అడిగితే రాలే అంటాండ్రు. వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నా పంట రుణం మాఫీ చేసి నన్ను ఆదుకోవాలి.

– తుంగల సమ్మయ్య, రైతు, మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## రుణమాఫీ కాక.. సమాచారం తెలియక..

- మహదేవపూర్ ఏవో ఆఫీస్ వద్ద రైతుల ఆందోళన
- అధికారులు, సిబ్బంది తీరుపై ఆగ్రహం

మహదేవపూర్, ఆగస్టు 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు రైతులు పంట రుణమాఫీ కాలేదని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేశారు. లిస్ట్‌లో తమ పేర్లు ఉన్నాయో? లేవో? తెలియక రెండు రోజులుగా మనోవేదనకు గురవుతున్నారు. ఈక్రమంలో ఏవో కార్యాలయానికి వచ్చిన రైతులకు రుణమాఫీపై సరైన సమాచారం అందకపోవడంతో పాటు సమయపాలన పాటించకుండా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో సిబ్బందిని నిలదీశారు. రైతుల బాధలను పట్టించుకోవడం లేదని, కనీసం సరైన సమాచారం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన రైతులకు రుణమాఫీ అయ్యేలా చూడాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మహదేవపూర్ వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

# చింతలపల్లికి రుణమాఫికర్

- 720మందిలో 150 మందికే
- మాఫీ కాక 570మంది ఆందోళన
- రెన్యువల్ చేయకపోవడమే కారణం
- నిరసనలకు సిద్ధమవుతున్న రైతులు



చింతలపల్లి పీఏసీఎస్ కార్యాలయం

వరంగల్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని మూడు విడుతలుగా ప్రకటించినా వరంగల్ జిల్లాలోని అనేక గ్రామాల్లో అత్యధిక మంది రైతులకు వర్తించలేదు. కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల పరిధిలో వంద శాతం మంది రైతులు మాఫీని పొందలేకపోయారు. జాతీయ బ్యాంకుల నుంచి రుణం పొందిన కొద్ది మందికి మాత్రమే మాఫీ వర్తించింది. ఇలాంటి గ్రామాల్లో సంగెం మండలంలోని చింతలపల్లి ఒకటి. చింతలపల్లి కేంద్రంగా పనిచేస్తున్న పీఏసీఎస్ పరిధిలో చింతలపల్లి, పల్లారుగూడ, మొండ్రాయి, కుంటపల్లి, కృష్ణానగర్ గ్రామాలుండగా, వాటిలోని 644 మంది రైతులు 2016, 2017లో సుమారు రూ.3.77 కోట్ల రుణాలు పొందారు. ఆ తర్వాత వీరి రుణాలను అధికారులు రెన్యువల్ చేయకపోవడంతో రుణమాఫీకి వారు అర్హులు కాలేదు.

**అధికారులే కారణం**

చింతలపల్లి పీఏసీఎస్ ద్వారా రుణాలు తీసుకున్న 644 మంది రైతులు 2018 డిసెంబర్ 12 లోపు రుణం పొందారు. ప్రభుత్వం రుణమాఫీ ద్వారా మొదటి విడత రూ.లక్ష రుణాలను మాఫీ చేసిన సమయంలోనే వీరిలో అనేక మంది పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో సొసైటీ కార్యాలయ సిబ్బందిని నిలదీయడంతో అసలు విషయం తెలిసింది. రుణాలను రెన్యువల్ చేయకపోవటం వల్లే తాము రుణమాఫీని కోల్పోవాల్సి వచ్చిందని వ్యవసాయ, సహకారశాఖ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 644 మందిలో చింతలపల్లి గ్రామ రైతు లే 570 మంది ఉన్నారు. కాగా, ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన అధికారులు రుణమాఫీ పథకం అమల్లోకి రాకముందే చింతలపల్లి పీఏసీఎస్ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేశారు.

**720 మందిలో 150 మందికే..**

చింతలపల్లి గ్రామంలో సుమారు 720 మంది రైతులుండగా, వీరిలో 570 మంది పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందగా వారికి మాఫీ వర్తించలేదు. సంగెం, వరంగల్‌లోని గ్రామీణ వికాస్, యూనియన్ తదితర జాతీయ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న మిగతా 150 మందికి మాఫీ వర్తించింది.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



రుణమాఫీ వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన చింతలపల్లి పీఏసీఎస్ చైర్మన్, సీఈవోలపై చర్యలు తీసుకోవాలి. మా సొసైటీ సభ్యులకు రూ.3.77 కోట్ల రుణం మాఫీ కావాల్సి ఉండగా వారి వల్ల రుణమాఫీని కోల్పోయాం. 30 మంది రైతులు రుణానికి సంబంధించి రూ.14 లక్షలు చెల్లిస్తే చైర్మన్, సీఈవో ఆ డబ్బును వారి సొంతానికి వాడుకున్నారు. ధాన్యం రవాణా ఛార్జీలు రూ.3 లక్షలు, రేషన్‌కు సంబంధించి నెలకు రూ.16 వేల చొప్పున వచ్చే డబ్బు లెక్కలను కూడా చూపడం లేదు. రుణమాఫీ వర్తించని రైతులందరం కలిసి సంఘటితంగా పోరాడుతాం. మా రుణాలు మాఫీ అయ్యేవరకు ఆందోళన చేస్తాం.

– వేల్పుల ఐలయ్య, రైతు, చింతలపల్లి

### ఐదు వేలు కడితేనే మాఫీ వస్తదంటున్నరు..



నేను కమలాపూర్ యూనియన్ బ్యాంకులో రెండు లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నా. మూడు నెలల కిందనే క్రాప్‌లోన్ రెన్యువల్ చేసిన. అయినా నాకు రుణమాఫీ రాలే. రెగ్యులర్‌గా రుణాలు చెల్లించిన వాళ్లకే రుణమాఫీ కావడం లేదు. పెండింగ్ ఉన్నోళ్లకే మాఫీ అయింది.

– రాంశెట్టి మల్లయ్య, రైతు, కమలాపూర్

## మేమేం పాపం చేసినం..

- మాకెందుకు రుణమాఫీ కాలె..
- అధికారులను నిలదీసిన రైతులు
- సమాధానం చెప్పలేక వ్యవసాధికారుల తంటాలు



కమలాపూర్‌లో ఏవో కార్యాలయం వద్ద రుణమాఫీపై ఏవోను నిలదీస్తున్న రైతులు

కమలాపూర్, ఆగస్టు 17 : రెండు లక్షల రుణమాఫీ అన్నరు. లక్షా 99వేలలోపు వారికే మాఫీ చేసిండ్రు.. మేమేం పాపం చేసినం.. మాకెందుకు రుణమాఫీ కాలేదంటూ రైతులు వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసినమని గొప్పలు చెప్పుతుంది. క్రాప్‌లోన్ రెండు లక్షలు తీసుకుంటే అసలుకు, మిత్తి కలిపి రెండు లక్షల కంటే ఎక్కువ ఉన్నయని, మాఫీ వర్తించలేదని అధికారులు చెప్పుతున్నరు. ఇది బ్యాంకు అధికారుల తప్పిదమా? మాకెందుకు రుణమాఫీ రాలేదని అధికారులను నిలదీస్తున్నారు. శనివారం ఒకే రోజు హెల్ప్‌లైన్ డెస్క్‌కు ఆరువందల మంది రైతులు రావడంతో అధికారులు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడ్డారు. బ్యాంకుకు వెళ్తే బ్యాంకర్లు మేం లిస్టు ఎప్పుడో పంపినం. మళ్లీ పంపాలని ఆదేశాలు వస్తేనే పంపిస్తమని చెప్పుతున్నరు. ఏం చేయాలో తెలియక రైతులు బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నరు.

# అలంకానిపేటలో అస్తవ్యస్తం..

## 1270 మంది రైతులకు 384 మందికే రుణమాఫీ




అలంకానిపేటలోని ఐఓబీ బ్యాంకు

నర్సంపేట, ఆగస్టు17 : రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు(ఐవోబీ) పరిధిలో అలంకానిపేట, తోపనపెల్లి, బొల్లికొండ, పెద్దకొర్పోలు, రెడ్యానాయక్ తండా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని రైతులు 2018 తర్వాత 1270మంది రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్షలోపు 700 మంది, రూ.లక్షన్నర లోపు 350మంది, రూ.2లక్షల లోపు 170మంది రుణాలు తీసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు కేవలం 384మంది రైతులకు మాత్రమే రుణమాఫీ కాగా, 886 మందికి అర్హత ఉన్నా కాలేదు. రూ.లక్ష, రూ.లక్షన్నర లోపు 320 మంది, రూ.2లక్షల లోపు 64మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. మిగితా రైతులు బ్యాంకుకు వెళ్లి అడిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదు. బ్యాంకు ఎదుట, వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేసినా పట్టించుకునే వారు లేరు. రైతులందరికీ రుణమాఫీ వస్తుందని చెబుతున్నారు కానీ, సమస్యను పరిష్కరించడం లేదని రైతులు వాపోతున్నారు.

## మాఫీ కొందరికే

### హనుమకొండ జిల్లాలో లక్ష మందికి కాలే..



నర్సింహులపేటలో రుణమాఫీ పేర్లు చూసుకుంటున్న రైతులు

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 17 : రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేశామని ప్రభుత్వం ఢంకా బజాయించి మరీ చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదు. రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని చాలా మంది అన్నదాతలు చెబుతున్నారు. హనుమకొండ జిల్లాలో 1,46,184 మంది రైతులు ఉన్నారు. వీరిలో మూడో విడుతలో 9,506 మందికి రూ.122.49 కోట్లు, రెండో విడుతలో 14,700 మందికి రూ.143.84 కోట్లు, మొదటి విడుతలో 25,391 మందికి రూ.141.96 కోట్లు, మొత్తం 49,597 మందికి రుణాలు మాఫీ చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా లెక్కలు విడుదల చేసింది. కాగా, ఇందులో మూడో విడుత ప్రకటన చేసి మూడు రోజులవుతున్నా జాబితా విడదల చేయకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులకు మాఫీ చేశామని సర్కారు ప్రకటించగా, బ్యాంకుల నుంచి అతి తక్కువ మందికి మాత్రమే మెసేజ్‌లు వచ్చాయి. అర్హత ఉన్నా ఎలాంటి సమాచారం రాని రైతులు వ్యవసాయ కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో బదిలీల ప్రక్రియ జరుగుతుండడంతో అధికారులు ఏం సమాధానం చెప్పలేక పోతున్నారు. దాదాపు ఇంకా లక్ష మంది రైతుల వరకు రుణాలు మాఫీ కాలేదని స్పష్టమవుతున్నది. వీరిలో అర్హులు వేల సంఖ్యలో ఉంటారని రైతులు చెబుతున్నారు. ఇక రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న వారు మిగతా డబ్బులు చెల్లిస్తే రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా, డబ్బుల చెల్లింపు విషయంలో బ్యాంకర్లకు ఎలాంటి సమాచారం లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.



### న్యాయం చేయాలె..

నాకు ఐదెకరాల పంట భూమి ఉన్నది. నా భార్య పేరుమీద రూ.లక్ష, నా పేరు మీద రూ.లక్ష వరకు ఇల్లంద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో నాలుగేళ్ల క్రితం పంట రుణం తీసుకున్నం. నాకు రేషన్‌కార్డు ఉన్నది. నెల రోజుల క్రితమే పంట రుణానికి సంబంధించి రూ.8వేల వడ్డీని చెల్లించిన. ఏటా రెన్యువల్ చేయిస్తున్న. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేశామని ప్రకటించడంతో శనివారం బ్యాంకుతో పాటు ఏఈవో వద్దకు వెళ్లి అడిగితే రుణమాఫీ కాలేదని చెప్పారు. నాకు అర్హత ఉన్నా మాఫీ కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి.

– సమ్మెట లక్ష్మీనారాయణ, రైతు, ఇల్లంద, వర్ధన్నపేట

## అరకొరగా రుణమాఫీ

వర్ధన్నపేట, ఆగస్టు 17 : పూర్తిస్థాయిలో రుణమాఫీ కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో శనివారం 'నమస్తే తెలంగాణ' పలువురు రైతులను కలిసి పంట రుణమాఫీ వివరాలను సేకరించింది. గ్రామానికి చెందిన సుమారు 30మంది రైతులకు రుణమాఫీ వర్తించ లేదని చెప్పారు. రూ.50వేల నుంచి రూ.లక్షలోపు 327 మంది, రూ.లక్ష నుంచి రూ. లక్షా50వేల లోపు 148 మంది రైతులకు రుణమాఫీ కాగా, రూ.లక్ష 50వేల లోపు 15మంది, రూ.2లక్షల లోపు 15మంది వరకు రుణమాఫీ కాలేదని వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆధార్ నమోదులో తప్పులు, రేషన్ కార్డు వివరాలు సరిగ్గా లేక రుణమాఫీ కాలేదని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లంద గ్రామానికి చెందిన కర్కాటకపు స్వర్ణ, ఎద్దు రమేశ్, తక్కళ్లపెల్లి గోపిచంద్, సమ్మెట లక్ష్మీనారాయణ, పోశాల స్వప్న, పాకనాటి నర్సింహారెడ్డి తదితర రైతులకు రుణమాఫీ జరగకపోవడంతో ఈవోను కలిసి ఫిర్యాదు చేశారు.

## బేతోలులో 122మంది ఎదురుచూపులు..

మహబూబాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : రైతు రుణమాఫీ అంతా గందరగోళం. అర్హులకు కూడా మాఫీ వర్తించకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. మహబూబాబాద్ మండలం బేతోలు గ్రామంలో 420 మంది రైతులుండగా, 360 మంది వివిధ బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకున్నారు. వీరిలో 130 మంది రైతులు కటాఫ్ తేదీకి ముందు ఉండడంతోపాటు రెన్యువల్ చేయించకపోవడంతో రుణమాఫీ వర్తించలేదు. మిగిలిన 230 మందిలో మొదటి విడుతలో 13 మందికి, రెండో విడుతలో 21 మంది, మూడో విడుతలో 74 మందికి మొత్తం 108 మందికి రుణాలు మాఫీ అయ్యాయి. మిగిలిన 122 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

### ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోంది..



రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందిపెడుతున్నది. రూ.1.60 లక్షలు క్రాప్‌లోన్ తీసుకున్న. మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేయాలి. రూ.2లక్షల రుణమాఫీ అన్నరు.. కానీ, నాకు రూ.1.60లక్షలు మాఫీ చేయలె.

– గుండె పల్లి రవీందర్‌రావు, రైతు, బేతోలు



ములుగులోని గ్రీవెన్స్ వద్ద రైతుల రద్దీ

## రుణమాఫీ గ్రీవెన్స్‌కు రైతుల తాకిడి

ములుగు, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ) : అర్హత ఉండీ రుణమాఫీ కాని రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌లకు రైతుల తాకిడి పెరుగుతున్నది. ఎందుకు రుణామాఫీ కాలేదో వారికి సమధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ములుగు జిల్లాకేంద్రంతో సహా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన రుణమాఫీ గ్రీవెన్స్‌సెల్‌లకు మాఫీ కాని రైతులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. జిల్లాలో రెండు విడుతల్లో 19,644 మంది రైతులకు రూ.137.42కోట్లు మాఫీ అయ్యాయి. మూడో విడుతలో ఎంతమందికి మాఫీ వర్తించిందో అధికారులు సరిగా చెప్పలేకపోతున్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగగా, అంతకుమించి ఉన్న రైతులతో పాటు ఇతర కారణాలతో రుణమాఫీ కాని వారంతా గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చి వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ములుగు వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌ను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శనివారం సందర్శించి రుణమాఫీపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, బ్యాంకర్లు రైతుల ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేయాలని ఆమె కోరారు.







## 'నమస్తే' ఫొటోగ్రాఫర్ ప్రతాప్ రికార్డు

### వరుసగా నాలుగోసారి రాష్ట్రస్థాయికి ఎంపిక



మేరుగు ప్రతాప్

గిర్మాజీపేట, ఆగస్టు 17 : వరుసగా నాలుగోసారి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికై 'నమస్తే తెలంగాణ' వరంగల్ ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్ రికార్డు సృష్టించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇటీవల రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా వరంగల్ నగరానికి చెందిన మేరుగు ప్రతాప్ ఎంపికయ్యాడు. వరుసగా ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన ప్రతాప్‌ను పలువురు అభినందిస్తున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట గ్రీన్‌పార్క్ హోటల్‌లో సోమవారం అవార్డు అందుకోనున్నారు.




కేఎంసీ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

- కోల్‌కతా ఘటనపై భగ్గుమన్న మెడికోలు
- కేఎంసీ, ఎంజీఎం వద్ద మిన్నంటిన నిరసనలు

## దోషులకు శిక్ష.. మాకు రక్ష




వరంగల్ చౌరస్తా, ఆగస్టు 17 : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నిందితులను కఠినంగా శిక్షించి, ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ జూనియర్, సీనియర్ వైద్యులు రోడ్లపై ర్యాలీలు, రాస్తారోకోలు చేయగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్, ఐఎంఏ, తెలంగాణ ఆప్తమాలజీ అసోసియేషన్ సభ్యులు, సీకేఎం వైద్యశాల డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కళాశాలల విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేఎంసీ, ఎంజీఎం ప్రధాన కూడలిలో పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## ధగ ధగ మెరిసిన కీర్తి

- హనుమకొండలో 'జోస్ ఆలుక్కాస్' షోరూం ప్రారంభం
- అందుబాటులోకి మరో బ్రాండెడ్ నగల షోరూం



హనుమకొండ, ఆగస్టు 17 : ప్రముఖ సినీనటి కీర్తి సురేశ్ నగరంలో సందడి చేసింది. హనుమకొండలోని నక్కలగుట్టలో జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభించేందుకు వచ్చిన కీర్తిని చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు, ప్రజలు పోటీపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వెరైటీ జువెలరీతో ధగధగ మెరిసిపోయింది.



షోరూం వద్ద నటి కీర్తిని సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధిస్తున్న అభిమానులు

